నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

3 | నిజామాబాద్, గురువారం 31 అక్టోబర్ 2024 | KAMAREDDY




లక్ష్మీదేవి ప్రతిమలు కొనుగోలు చేస్తున్న మహిళలు

# వెలుగుల ఉషస్సు

- నేడే దీపావళి పర్వదినం
- మార్కెట్లకు పండుగకళ
- పూలకు, పటాకులకు ఫుల్లు గిరాకీ



**భారతీయ సంస్కృతిని** ప్రతిబింబించేవి పండుగలు. వాటిలో కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి ఆనందోత్సహాలతో సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి. నరకాసురడిని సంహరించిన తర్వాతి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే, లంకలో రావణుని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు కూడా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని జరుపుకుంటారని రామాయణం చెబుతున్నది. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమావాస్య కావడంతో, చీకటిని పారదోలుతూ ప్రజలు దీపాలతో తోరణాలు కట్టి బాణా సంచా కాల్చి వేడుక చేసుకుంటారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది. విజయానికి ప్రతీకగా భావించే దీపావళి పండుగకు ఉమ్మడి జిల్లా ముస్తాబైంది. కొనుగోళ్లతో బుధవారమే మార్కెట్లకు పండుగ కళ వచ్చింది. పూలు, పండ్లు, పటాకులకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది.

–సుభాష్‌నగర్/కామారెడ్డి, అక్టోబర్ 30

ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు





కామారెడ్డిలో పటాకుల విక్రయాలు

## మార్కెట్లు కిటకిట..

ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లు బుధవారం కిటకిటలాడాయి. కామారెడ్డితో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాలలో దీపావళి కొనుగోళ్ల సందడి నెల కొంది. రకరకాల ప్రమిదలు, బంతి పూలు, గుమ్మడి కాయల విక్రయాలు జోరుగా సాగాయి. పటాకుల దుకాణాలు రద్దీగా మారాయి. స్వీట్ల దుకాణాలు, జన రల్ స్టోర్స్, పూల దుకాణాలు పొద్దంతా కిటకిటలాడాయి. కామారెడ్డిలోని జేపీ యన్ రోడ్, సుభాష్‌రోడ్, తిలక్ రోడ్, సిరిసిల్లా రోడ్, స్టేషన రోడ్ సందడిగా మారాయి. నిజామాబాద్‌లో రెండ్రోజుల ముందు నుంచే దీపావళి విక్రయాలు జోరందుకున్నాయి. ఖాతా పుస్తకాలు, లక్ష్మి ప్రతిమలు, ప్రమిదలు, అరటిచెట్లు, పూలు, పండ్లకు డిమాండ్ నెలకొంది. పూలాంగ్, వర్ని చౌరస్తా, కంఠేశ్వర్, బైపాస్‌రోడ్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో తీవ్ర రద్దీ కనిపించింది.

## ప్రముఖుల శుభాకాంక్షలు

దీపావళి పండుగ సందర్భంగా మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలు వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందన్న ప్రశాంత్‌రెడ్డి.. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## లక్ష్మీపూజ

దీపావళి నాడు లక్ష్మీదేవిని పూజించటం సంప్రదాయం. వ్యాపారులు, సుహాసినులు లక్ష్మీదేవిని పూజించి ధూపదీప నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ రోజున వ్యాపారసంస్థల్లో కొత్త లెక్కల పుస్తకాలు మొదలు పెడతారు. ఆశ్వయుజ బహుళ అమావాస్య గురువారం స్వాతి నక్షత్రం రావటం విశేషమని వేద పండితులు చెబుతున్నారు. ఉదయం 9 నుంచి 11గం.ల వరకు గాది పూజలు, మధ్యాహ్నం 2 నుంచి అర్ధరాత్రి వరకు గృహాల్లో, వ్యాపార సముదాయాల్లో ధనలక్ష్మీ పూజలు చేసుకోవాలని సూచించారు.



కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంబురాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# బీఆర్ఎస్ సంబురాలు

కామారెడ్డి, అక్టోబర్ 30: ప్రజలపై ప్రభుత్వం మోపాలనుకున్న రూ.18.50 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని విజయవంతంగా అడ్డుకోవడంపై బీఆర్ఎస్ నేతలు బుధవారం సంబురాలు జరుపుకొన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదేశాలతో కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ మాట్లాడుతూ.. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.18.50 వేల కోట్ల మేర విద్యుత్ చార్జీలను పెంచేందుకు యత్నించిందని మండిపడ్డారు. పెంపు ప్రతిపాదనలను ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ అడ్డుకున్నదన్నారు. మొత్తం ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుంచి మొదలుకొని ఇప్పటిదాకా ప్రధాన ప్రతిపక్షం వాదనలోని సహేతుకతను, న్యాయాన్ని విని సంపూర్ణంగా చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్సీ తిరస్కరించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సరైన పద్ధతిలో శాస్త్రీయంగా ఈఆర్సీ ముందు ఉంచడంలో విజయం సాధించామన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, నేతలు జూకంటి మోహన్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి బల్వంత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, కుంబాల రవియాదవ్, మాజీ ఎంపిపి పిప్పిరి ఆంజనేయులు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

# రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం విద్యార్థుల దీక్ష

ఖలీల్‌వాడి, అక్టోబర్ 30: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుద చేయాలని విద్యార్థులు నిజామాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద బుధవారం దీక్ష చేపట్టారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనకు భారీగా హాజరైన విద్యార్థులు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టారని, కానీ ఇప్పటికీ విడుదల చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో లిక్కర్‌కు మంత్రి ఉండొచ్చు కానీ, సమాజాన్ని మార్చే విద్యావ్యవస్థకు మాత్రం మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఎమ్మెల్యే ఇండ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రమేశ్‌బాబు, విఘ్నేశ్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం చేపట్టిన ఫీజు దీక్షలో పాల్గొన్న విద్యార్థులు

# రైతులకు ఇచ్చిన హామీలు ఏమైనయ్?

## మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

మద్నూర్, అక్టోబర్ 30: రైతులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల తర్వాత వారిని మోసం చేసిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విమర్శించారు. మద్నూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'రైతన్న కోసం రణం బాట' కార్యక్రమంలో షిండే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు సంధించారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా లేక, రుణమాఫీ కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు రైతులకు వద్దకు వెళ్లి తమ ప్రభుత్వం వస్తే ఎకరానికి రూ.15 వేలు, డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారని, ఇప్పుడు అదే నాయకులు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కు వెళ్లి ధర్నా చేయాలని సూచించారు. అయితేనే ఎమ్మెల్యే.. ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్తారని, అప్పుడు రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రూ.4 వేల పింఛన్ ఇస్తామన్న కాంగ్రెస్.. పది నెలల పాలనలో ఒక్కొక్కరికి రూ.20 వేల బాకీ పడిందన్నారు. ప్రస్తుతం రైతులు, యువకులు, మహిళలు, నిరుద్యోగులు.. కేసీఆర్ పాలనే చాలా బాగుండే అని అంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కరెంట్ చార్జీల బాదుడు తప్పిందని, ఇందుకు కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ నేతలు బస్సిపటేల్, సురేశ్, విజయ్‌కుమార్, నీలుపటేల్, విజయ్‌పటేల్, గఫర్, రవి, నాగేశ్, రాజు, మారుతి పాల్గొన్నారు.



రైతురణం కార్యక్రమంలో మాట్లాడుతున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే








